రివర్స్ టెండరింగ్ ద్వారా
నెయ్యి కొనుగోలు
ఆంధ్రజ్యోతి కథనానికి అన్నవరం దేవస్థానం అధికారుల వివరణ... 6లో



పిఠాపురంలో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

అంతకు మించి

వాన... వానే వాన... వద్దంటే వాన... కుండపోత నుంచి కుంభవృష్టిగా... అవసరం నుంచి అదనంగా... ఒకటి కాదు రెండుకాదు ఏకంగా కొన్నిసార్లు రోజుల తరబడి అలా ఎడతెరిపిలేకుండానే.... ఇదీ ఈ వర్షాకాలం సీజను నాలుగు నెలల్లో జిల్లాలో కురిసిన వర్షాల తీరు. ఈ దఫా నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో కుంభవృష్టి వానలు కురిసాయి. ఫలితంగా జిల్లాలో వర్షపాతం సాధారణం స్థాయి నుంచి అవసరానికి మించిన అదనపు స్థాయికి చేరిపోయింది. పుష్కల వర్షాలతో దాదాపు జిల్లా అంతా అంచనాలకు మించిన వర్షపాతంతో భూగర్భ జలాలు సైతం కళకళలాడుతున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే జూన్‌లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించింది మొదలు తాజాగా రుతుపవనాల సీజను ముగిసిన వరకు... 116 రోజుల్లో జిల్లాలో ఏకంగా 55 రోజులు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జూన్ 1 నుంచి మంగళవారం వరకు జిల్లాలో మొత్తం 62 సెంటీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఏకంగా 83 సెం.మీ. వర్షపాతం నమోదవ్వడం విశేషం. జిల్లాలో మొత్తం 21 మండలాలకు ఏకంగా రికార్డు స్థాయిలో 16 మండలాల్లో అదనపు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కోటనందూరు మండలంలో ఈ నాలుగు నెలలకు కలిపి సరాసరి 46 సెం.మీ. వాన కురవాల్సి ఉంటే ఏకంగా 91 సెం.మీ. వర్షం కురిసింది. అటు జగ్గంపేట, పెద్దాపురం, ఏలేశ్వరం, కాకినాడ అర్బన్, యు.కొత్తపల్లి మండలాల్లో మాత్రం కేవలం సాధారణ వర్షపాతం నమోదైంది. ఒక్క సెప్టెంబరు నెల తీసుకుంటే నాలుగు మండలాలు మినహా అన్నిచోట్లా కుంభవృష్టి వాన కురిసింది.



కాకినాడ-పిఠాపురం జాతీయ రహదారిపై జోరు వర్షం

- జిల్లాలో ఈదఫా నైరుతి రుతుపవనాల సీజను అంతా కుంభవృష్టిగా వానలు
- జూన్ నుంచి ఇప్పటివరకు 116 రోజుల్లో 55 రోజులు ఏకధాటిగా వర్షాలే వర్షాలు
- జిల్లాలో ఈ నాలుగు నెలల్లో 62 సెంటీమీటర్ల వర్షం కురవాల్సి ఉంటే ఏకంగా 83 సెం.మీ. నమోదు
- సాధారణ కేటగిరీ నుంచి అదనపు వర్షపాతం జాబితాలోకి చేరిన కాకినాడ జిల్లా
- మొత్తం 21 మండలాలకు ఏకంగా రికార్డు స్థాయిలో 16 మండలాల్లో అదనపు వర్షపాతం
- జగ్గంపేట, పెద్దాపురం, ఏలేశ్వరం, కాకినాడ సిటీ, యు.కొత్తపల్లి మండలాల్లో సాధారణం
- కోటనందూరు మండలంలో 46 సెం.మీ. వాన కురవాల్సి ఉంటే అత్యధికంగా 91 సెం.మీ. నమోదు
- నెలలో నాలుగు మండలాలు మినహా జిల్లా అంతా కుంభవృష్టిగా వర్షాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఏటా వర్షాకాలం సీజన్లో నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తాయి. కానీ ఈసారి జిల్లాలో ఏకంగా కుంభవృష్టిగా వానలుపడ్డాయి. సాధారణంగా రుతుపవనాల తాకిడితో సాధారణం నుంచి మోస్తరుగా వర్షాలు నమోదవ్వడం ఆనవాయితీ. అప్పుడప్పుడు తుఫాన్లు ఏర్పడ్డా వాటి ప్రభావంతో వర్షపాతం నమోదులో పెద్దగా మార్పులు ఉండవు. కానీ ఈసారి రుతుపవనాలకు తోడు వరుసగా అల్పపీడనాలు, తీవ్ర అల్పపీడనం, తుఫాన్లు ఏర్పడ్డంతో సీజన్ అంతా వానలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో గత సీజన్లతో పోల్చితే ఈసారి వర్షాలు ఎక్కువగా కురిశాయి. ప్రధానంగా జిల్లాలో ఈ ఏడాది జూన్ నుంచి ఈనెల సెప్టెంబరు 24 వరకు తీసుకుంటే మొత్తం 116 రోజుల్లో ఏకంగా 55రోజులు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. కొన్ని మండలాల్లో ఏకంగా ఒకేరోజులో పది సెంటీమీటర్లకు మించిన వర్షపాతం నమోదైంది. ఆగస్టులో దాదాపు సగానికిపైగా రోజులు జిల్లా అంతా వానలు పడ్డాయి. సెప్టెంబరులో తొలి రెండు వారాల్లో జిల్లా అంతా వర్షాలు దంచికొట్టాయి. దీంతో ఎక్కడికక్కడ వర్షపాతం భారీగా నమోదైంది. వాస్తవానికి జూన్ నుంచి ఇప్పటివరకు వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో 21 మండలాల్లో కలిపి సాధారణ వర్షపాతం 62.4 సెంటీమీటర్లు నమోదు కావాలి. కానీ అంతకుమించి ఏకంగా 83.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వడం రికార్డు అని చెప్పాలి. ఫలితంగా కావలసిన వర్షపాతం కంటే జిల్లాలో అదనంగా ఏకంగా 34.13శాతం ఎక్కువగా నమోదైంది. దీంతో జిల్లా సాధారణ వర్షపాత కేటగిరీ నుంచి ఎక్సెస్ జాబితాలోకి చేరిపోయింది. మొత్తం 21 మండలాలకు 16 మండలాల్లో అదనపు వర్షపాతం కురిసింది. జగ్గంపేట, పెద్దాపురం, ఏలేశ్వరం, కాకినాడ సిటీ, యు.కొత్తపల్లి మండలాల్లో మాత్రం కురవాల్సినంత వర్షమే కురిసింది.


ఆ మండలంలో కుంభవృష్టి..

జూన్ 1 నుంచి మంగళవారం వరకు గణాంకాలను పరిశీలిస్తే గండేపల్లి మండలంలో 63.6 సెం.మీ. వర్షం కురవాలి. కానీ ఏకంగా 81.9 సెం.మీ. కురిసింది. దీంతో ఇక్కడ కావలసిన వానకంటే 28.76శాతం అధికంగా నమోదైంది. దీంతో ఈ మండలం ఎక్సెస్ వర్షపాతం జాబితాలోకి చేరింది. గొల్లప్రోలు మండలంలో 49.2 సెం.మీ.కి 83.6 సెం.మీ. వర్షం కురిసింది. ఏకంగా 69.66శాతం అధికంగా వానలుపడ్డాయి. కాజులూరు మండలంలో 61సెం.మీ. కుగాను 83.7 సెం.మీ. వర్షం కురిసింది. ఇక్కడ 37.25 శాతం అధికంగా వాన పడింది. కాకినాడ రూరల్ 62.4 సెం.మీ.కి 78.6 సెం.మీ. వాన పడింది. 25.95శాతం అదనంగా కురిసింది. కాకినాడ సిటీలో 62.4 సెం.మీ.కి 63.7 సెం.మీ. పడింది. అంటే ఇక్కడ సాధారణ వర్షపాతమే నమోదైంది. కరపలో 60 సెం.మీ.కు 82సెం.మీ. కురిసింది. కిర్లంపూడి 64.4కు 79.2, కోటనందూరు మండలంలో అయితే 46.1సెంటీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉంటే ఏకంగా 91.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. 98.32శాతం అదనంగా వానలు పడ్డాయి. జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది ఈ మండలంలోనే. పెదపూడిలో 58.6కు 81.4, పిఠాపురంలో 67.4కు 80.7సెం.మీ. వర్షం కురిసింది. ఇక్కడ 19.64శాతం అధికంగా వర్షం కురిసింది. ప్రత్తిపాడులో 68.8కి, 84.2, రౌతులపూడి 63.7కు 89.5, సామర్లకోట 62.5కు 79.1, శంఖవరం 63.7కు 88.2, తాళ్లరేవు 69.2కు 83.6, తొండంగి 61కి 88.6, తుని 65కు 90సెం.మీ వర్షం కురిసింది. అటు సెప్టెంబరు నెల పరిశీలిస్తే కోటనందూరు మండలంలో 12.5 సెం.మీ వర్షం కురవాల్సి ఉంటే 22.2 సెం.మీ కురిసింది.

ఈ మండలాల్లో అంతంతే...

జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో అదనంగా భారీస్థాయిలో వర్షపాతం నమోదవగా... నాలుగు మండలాల్లో మాత్రం సాధారణ వర్షం కురిసింది. జగ్గంపేట మండలంలో ఈ సీజన్లో 67.5 సెంటీమీటర్ల వర్షపాతానికి 77.5సెంటీమీటర్లే పడింది. అంటే 14.84 శాతమే అధికంగా ఉండడంతో సాధారణ జాబితాలో చేరింది. యు.కొత్తపల్లి మండలంలో 60సెం.మీకు 63.4 కురిసింది. పెద్దాపురంలో 66.7కు 78.7 సెం.మీ., ఏలేశ్వరం మండలంలో 68కి 79.7సెంటీమీటర్ల వాన పడింది. సెప్టెంబరు నెలలో కాకినాడ సిటీ, కరప, యు.కొత్తపల్లి, తాళ్లరేవు మండలాలు మినహా అన్నిచోట్లా భారీస్థాయిలో వర్షపాతం నమోదైంది.

పదవులు వరించెన్..



మొదలైన కార్పొరేషన్ పదవుల పందేరం

- ఒక చైర్మన్, 12 బోర్డు మెంబర్లు
- కూటమి పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం
- పదవులు దక్కిన వారిలో సంతోషం
- ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కార్పొరేషన్ పదవుల పందేరం మొదలైంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీల నాయకులకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ఆయా పదవులకు ఎంపిక చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ముఖ్యంగా వర్గాల సమీకరణలను ప్రధానంగా పరిగణలోకి తీసుకున్నట్టు తొలి జాబితా స్పష్టం చేస్తోంది. కార్పొరేషన్ పదవుల జాబితా వెల్లడితో మంగళవారం ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఈ పదవుల కోసం ఎదురుచూస్తున్న వారిలోనూ టెన్షన్ పెరిగింది. తాము ఆశిస్తున్న పదవులు దక్కుతాయో లేదోనన్న ఆందోళన కనిపిస్తోంది. ఇక తొలి జాబితాలో చోటు దక్కించుకున్న వారిలో సంతోషానికి అవధులు లేవు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కేడర్‌లలో ఈ పదవుల పంపకం కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఒకే ఒక్క కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. కాకినాడ నగరానికి చెందిన జనసేన నాయకుడు తోట మెహర్ సీతారామ సుధీర్‌ను రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ పదవి వరించింది. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా ఈ సంస్థ చైర్మన్‌గా కాకినాడకు చెందిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి తండ్రి భాస్కరరెడ్డి కొనసాగారు. దీంతో మళ్లీ అదే సంస్థ చైర్మన్ పదవి కాకినాడకు దక్కినట్టయింది. ఇక ప్రకటించిన వివిధ కార్పొరేషన్లకు సంబంధించి మొత్తం 13 మంది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు బోర్డు మెంబర్లుగా నియమితులయ్యారు. ఇందులో కాకినాడ జిల్లాకు నలుగురు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన నలుగురు, తూర్పు గోదావరి జిల్లా నుంచి ఐదుగురు ఉన్నారు. నామినేటెడ్ పోస్టుల పందేరానికి తెరదీయడంతో మిగిలిన ఆశావహులు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు.

పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా సుధీర్

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా జనసేనకు చెందిన తోట సుధీర్‌ను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కసరత్తు చేసి సమర్థుడినే ఎంపిక చేసిందని చెప్పాలి. వృత్తిరీత్యా న్యాయవాది అయిన తోట సుధీర్ గతంలో టీడీపీ లీగల్ సెల్ విభాగంలో సుదీర్ఘ కాలం పనిచేశారు.ఈయన ప్రస్తుతం జనసేన కాకినాడ సిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే కాకినాడ టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్, గాంధీ సెంటినరీ కాలేజీల ప్రెసిడెంట్‌గా ఉన్నారు. వ్యాపార రీత్యా పలు పెట్రోల్ బంకులు, లారీలు ఉన్నాయి. ఈయన తండ్రి గతంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎస్‌ఈగా పని చేశారు. సుధీర్ న్యాయవాది అయినా వ్యవసాయం అంటే మక్కువ. ఈయన భార్య వైద్యురాలు. కూతురు వైద్య విద్య చదివి ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. తోట సుధీర్ అల్లుడు పవన్ కల్యాణ్ వ్యక్తిగత వైద్యుడు. దీంతో పవన్‌తో సుధీర్‌కు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. కాకినాడ జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్..తోట సుధీర్ అల్లుడికి సొంత సోదరుడు. అల్లుడి ద్వారా పవన్‌తో సత్సంబంధాలు ఏర్పడడంతో సుధీర్ గతేడాది జూన్‌లో పవన్ సమక్షంలో భీమవరంలో జనసేనలో చేరారు. అప్పటి నుంచి కాకినాడ సిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.



బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెడతా..

కాకినాడ పోర్టు నుంచి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కాకుండా ఉక్కుపాదం మోపుతా. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన డిప్యూటీ సీఎం పవన్, సీఎం చంద్రబాబు, మంత్రి మనోహర్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్నా. రేషన్ బియ్యం కేవలం పేదలకే చెందే విధంగా చర్యలు తీసుకుంటా. రాష్ట్రవ్యాప్తంగా బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటా.

కాకినాడ జిల్లా నుంచి నలుగురు..



కడలి ఈశ్వరి



తుమ్మల పద్మజ



సత్యనారాయణ



జయకృష్ణ

కలెక్టరేట్ (కాకినాడ)/పెద్దాపురం/గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 24: కాకినాడ జిల్లాలో నలుగురు వివిధ కార్పొరేషన్ల బోర్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. కాకినాడ రమణయ్యపేటకు చెందిన జనసేన నాయకురాలు కడలి ఈశ్వరి, పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన బీజేపీ నాయకురాలు తుమ్మల పద్మజ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన బేతా సత్యనారాయణ(టీడీపీ), చేబ్రోలు గ్రామానికి చెందిన సూరిశెట్టి జయ నాగకృష్ణ (జయకృష్ణ) (జనసేన)లను నియమించారు.

'తూర్పు'న నలుగురికి...



వేణుగోపాలరాయుడు



వి.రాంబాబు



స్వరూపదేవి



హరికిశోర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24: స్టేట్ కార్పొరేషన్ కమిటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన నలుగురు కూటమి నాయకులకు స్థానం లభించింది. రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ సీనియర్ నేత యర్రా వేణుగోపాలరాయుడును ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ మెంబరుగా నియమించారు. ఆయన గతంలో శాప్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఏపీ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, జనసేన నాయకురాలు గంటా స్వరూపదేవి నియమితులయ్యారు. పద్మశాలి వెల్ఫేర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడుగా రాజమహేంద్రవరానికి చెందిన మాజీ కార్పొరేటర్ టిహరికిషోర్ (బాబి)ను నియమించారు.

కోనసీమలో నలుగురికి..



చిల్లా జగదీశ్వరి



నరసింహరావు



నాగేశ్వరరావు



ఆనందసాగర్

అమలాపురం/ముమ్మిడివరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాకు చెందిన నలుగురిని రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లలో మెంబర్లుగా నియమించింది. అమలాపురానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు చిల్లా జగదీశ్వరిని ఏపీ స్టేట్ సీడ్స్ కార్పొరేషన్‌కు డైరెక్టర్‌గా నియమించారు. కాట్రేనికోనకు చెందిన మత్స్యకార నేత నాగిడి నాగేశ్వరరావును ఏపీ స్టేట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్‌కు డైరెక్టర్‌గా నియమించారు. టీడీపీ అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్‌ను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. మలికిపురానికి చెందిన జనసేన నాయకుడు గుండుబోగుల నరసింహారావును ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమించింది. టీడీపీ నాయకుడు నాగిడి నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు పార్టీ అధిష్ఠానం కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ డైరెక్టర్ పదవి కేటాయించడం సరికాదన్నారు. తనకు ఈ పదవిని స్వీకరించడం ఇష్టం లేదని, పార్టీ పునరాలోచన చేయాలని కోరారు.

గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

కలెక్టర్ షాన్ మోహన్



కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 24: జిల్లాలో గృహ నిర్మాణాలకు సంబంధించి గ్రౌండింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు స్లాబ్ వేసి అక్టోబరు చివరి నాటికి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన హౌసింగ్, జిల్లా ప్రజా పరిషత్, డ్వామా, పంచాయతీరాజ్, సమగ్ర శిక్షా శాఖల అధికారులతో సమీక్షించారు. పునాది, బేస్మెంట్ దశల్లో ఉన్న గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా స్లాబ్ లెవెల్‌లో వున్న, స్లాబ్ వేసిన గృహాల మిగిలిన పనులను అక్టోబరు చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. .2014-19 మధ్య కాలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు మధ్యలో బిల్లులు ఆగిపోయిన వాటికి సచివాలయం స్థాయిలో సర్వే నిర్వహించి యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. గ్రామీణ, మున్సిపల్ ప్రాంతాలతో పాటు సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియను అక్టోబరు 15 నాటికి పూర్తి చేయాలన్నారు. సోమ, గురువారాల్లో సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత తనిఖీ చేసి క్రమంగా నివేదిక పంపించాలన్నారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్వీవీ సత్యనారాయణ, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ వెంకటరమణరాజు, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈవో నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



లక్ష రూపాయల విరాళం చెక్కును కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబుకు అందజేస్తున్న వర్తకులు

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.లక్ష విరాళం అందజేత

కాకినాడ సిటీ, సెప్టెంబరు 24: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కాకినాడకు చెందిన వ్యాపారులు తాళ్లూరి కనకరాజు, తాళ్లూరి రాజేష్, బాదం జయరామ్, అనంత, హర్ష, సంపత్ బృందం లక్ష రూపాయల విరాళాలు సేకరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో మంగళవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు ఆయన నివాసంలో అందజేశారు.

డాక్టర్ సుమలతకు జీవిత సాఫల్య పురస్కారం

జేఎన్టీయూకే, సెప్టెంబరు 24: కాకినాడ జేఎన్టీయూ పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.సుమలత కౌన్సిల్ ఫర్ స్కిల్స్ కాంపిటెన్సీస్ (సీఎస్‌సీ) నుంచి జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ సంస్థ అనుబంధంగా ఉన్న సీఎస్‌సీ ఇండియా సీనియర్ కన్సల్టెంట్ వై.రామ్మోహనరావు నుంచి అవార్డు స్వీకరించారు. ఇంజనీరింగ్ విద్యలో నాయకత్వలక్షణాలు, ఆమె చేసిన చేసిన కృషి, సేవలకు ఈ పురస్కారం ప్రదానం చేసినట్టు రామ్మోహనరావు తెలిపారు. లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు సాధించిన సుమలతను వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



రామ్మోహనరావు నుంచి అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ సుమలత

బదిలీలు

సబ్ రిజిస్ట్రార్లు...

కాకినాడ సిటీ, సెప్టెంబరు 24: సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ అర్బన్ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. రిజిస్ట్రార్-1గా ఆర్వీ రామారావు, రిజిస్ట్రార్-2గా పీఎస్‌వీఎస్ఎస్ భద్రరావు నియమితులయ్యారు. ఇంతవరకు రిజిస్ట్రార్-1గా ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్-2గా రమ్యశ్రీ విధులు నిర్వర్తించారు. కాకినాడ డీఐజీ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్‌గా ఆర్. శ్రీనివాసరావు, కాకినాడ మార్కెటింగ్ అండ్ ఆడిట్ సబ్ రిజిస్ట్రార్‌గా ఎ.శ్రీనివాస్, కాకినాడ చిట్ రిజిస్ట్రార్‌గా ఎ.సునందశ్రీ, కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌గా కె.ఆనందరావు నియమతులయ్యారు.

తహసీల్దార్లు...

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 24: జిల్లాలో నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. కాకినాడ ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా విధుల్లో ఉన్న పి.త్రినాథ్‌రావును తాళ్లరేవు తహసీల్దారుగా నియమించారు. కరప తహసీల్దారు పీవీవీ గోపాలకృష్ణను పిఠాపురం తహసీల్దారుగా, పిఠాపురం తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారిని కాకినాడ రూరల్ తహసీల్దార్‌గా నియమించారు. కాకినాడ ల్యాండ్ రిఫార్మ్స్ డిప్యూటీ తహసీల్దారు ఎన్.సత్యనారాయణను కరప తహసీల్దారుగా నియమిస్తూ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

'నవోదయ'లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు ...6లో

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా సిద్ధం

- ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ
- ఓటర్ల సంఖ్య 13,677
- వివిధ కారణాలతో 514 దరఖాస్తుల తిరస్కరణ
- నవంబరు 6న తుది జాబితా: ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిప్పేనాయక్

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 24: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ మంగళవారం ప్రచురించారు. 14,191 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేయగా 13,677 దరఖాస్తులను అంగీకరించి జాబితాలో నమోదు చేశారు. వివిధ కారణాలతో 514 దరఖాస్తులను తిరస్కరించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను వచ్చే నెల 15వ తేదీ వరకు అన్ని తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. ఫారం-19, 7, 8 దరఖాస్తు చేసుకోవడం ద్వారా అభ్యంతరాలు తెలపవచ్చని వెల్లడించారు. అభ్యంతరాలను పరిశీలించి వచ్చే నెల 30వ తేదీలోపు పరిష్కరిస్తారు. నవంబరు 6వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో అత్యధికంగా కాకినాడ జిల్లాలో 3,003 ఓటర్లు, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 479 ఓటర్లు నమోదయ్యారు. తూర్పు గోదావరి జిల్లాలో 2,368, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2,634, ఏలూరు జిల్లాలో 2,274, పశ్చిమ గోదావరి జిల్లాలో 2,919 ఓటర్లు నమోదయ్యారు. 13,677 ఓటర్లలో పురుషులు 8,062 మంది, మహిళలు 5,613 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. ఇతర సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1950ను సంప్రదించాలి.

కడియంలో చిరుత పులి

- పాదముద్రలను పరిశీలించిన అటవీ శాఖ అధికారులు
- అవి పులివేనని నిర్ధారణ.. స్థానికుల్లో భయాందోళన ...6లో



అ'ధర'హో

- అనూహ్యంగా పెరిగిన కొబ్బరి ధరలు
- వెయ్యి కాయ రూ.18వేల నుంచి రూ.20వేలు
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతులే కారణం
- కొబ్బరి రైతుల్లో హర్షాతిరేకాలు

అయినవిల్లి, సెప్టెంబరు 24: కోనసీమ కొబ్బరికాయల ధరలు రెట్టింపుకుపైగా పెరిగాయి. శ్రావణమాసంలో వెయ్యి కాయలు రూ.9వేలు ధర ఉండగా ప్రస్తుతం వెయ్యి కొబ్బరికాయలు రూ.18వేల నుంచి రూ.20వేలకు చేరుకుంది. దసరా, దీపావళి, కార్తీకమాసం ముందు ఉన్నందున ధరలకు డోకాలేదని వ్యాపారవర్గాల వారు భావిస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కొబ్బరికాయల ఉత్పత్తి గణనీయంగా తగ్గడం, దేశవ్యాప్తంగా కొబ్బరికాయలకు డిమాండ్ అనూహ్యంగా పెరగడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి కోనసీమలో కొబ్బరి రైతులు ధర లేక దిగుబడి రాక విలవిల్లాడారు. నల్ల తెగులు, తెల్లదోమ తెగులువల్ల ఎకరాకు 300 కాయలు దిగుబడి మాత్రమే వచ్చేది. ఉత్పత్తి వ్యయాలు పెరిగిపోయి గిట్టుబాటు కాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో కొబ్బరిలో అంతర పంటలైన కోకో, పోక సాగుకు ఉద్యానశాఖ రాయితీపై మొక్కలు అందించేవారు. వైసీపీ పాలనలో ఉద్యానశాఖ అంతర పంటల సాగు ప్రోత్సాహకాలు నిలిపివేశారు. దీంతో రైతులు కొబ్బరిపైనే ఆధారపడే పరిస్థితి నెలకొంది. కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉండడం వలన రూ.9వేల రేటులోనే వ్యాపారస్తులు రైతుల నుంచి కొబ్బరికాయలు సేకరించి నిల్వ ఉంచుకోవడం వలన రైతుల కన్నా వ్యాపారస్తులకే పెరిగిన ధరలు లాభించాయని రైతులు అంటున్నారు. ఎండుకొబ్బరి క్వింటాల్‌కు రూ.15,500, కొబ్బరినూనె కిలో రూ.320, వర్జీనియా కోకోనట్ ఆయిల్ కిలో రూ.500 ధరలు పెరిగాయి. పచ్చికొబ్బరికాయలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ముంబై, రాజస్థాన్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహరాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, హర్యానా రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు కొబ్బరికాయలు కొనుగోలుకు కోనసీమ కేంద్రంగా చేసుకోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులంటున్నారు. సాధారణంగా బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా తదితర రాష్ట్రాలకు ఒలిచిన కొబ్బరికాయలు ఎగుమతి అవుతాయి. ప్రస్తుతం కొబ్బరికాయలకు డిమాండులో ఒలుపు చేయని కాయలను కొనుగోలు చేస్తున్నారు. టన్ను రూ.50వేలు వంతున అమ్మకాలు జరుపుతున్నట్టు వ్యాపార వర్గాలు అంటున్నారు.



రికార్డు ధర.. ఏడేళ్ల తరువాత కొబ్బరికాయలకు రికార్డు స్థాయిలో ధర వచ్చింది. 2017లో కొబ్బరికాయలు రూ.15వేలు ధర పలుకగా 2024లో రూ.20వేలు ధర పలకడం విశేషం. మార్కెట్‌లో ఈ స్థాయి ధర రావడం అరుదని రైతులు, వ్యాపారులు అంటున్నారు. పచ్చికొబ్బరికాయలతో పాటు కొబ్బరి ఉత్పత్తుల ధరలు పెరిగాయి. పాత కురిడీకాయ గండేలా వెయ్యింటికీ రూ.14వేలు, గటగటా రూ.17,500, కురిడీ కొత్తకాయ గండేరా రూ.13వేలు, గటగటా రూ.15,500 ధరలు పలుకుతున్నాయి.

సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్రంలోని సబ్-రిజిస్ట్రార్ల బదిలీల్లో భాగంగా జిల్లాలోని సబ్-రిజిస్ట్రార్ల అందరికీ స్థాన చలనం కల్పించింది. అయితే, ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. గరిష్ఠ కాల పరిమితితో సంబంధం లేకుండా బదిలీలు చేశారు. జిల్లాలోని సబ్-రిజిస్ట్రార్లు అందరూ ఆయా స్థానాల్లో నియమితులై సుమారు రెండేళ్లు మాత్రమే దాటింది. సాధారణంగా సబ్-రిజిస్ట్రార్లను మూడున్నరేళ్లు బదిలీ చేయరు. దీంతో మంచి స్థానాలు 'దక్కించుకున్న' వారు మినహా మిగతా వాళ్లు మనస్థాపం చెందుతున్నారు. రాజమహేంద్రవరం, కడియం, రాజానగరం, పిడింగొయ్యి స్థానాలకు 'ధర' ఎక్కువగానే పలికిందని ఉద్యోగ వర్గాల్లో చర్చనడుస్తోంది. ఈసారి యూ నియన్ల జోనల్ స్థాయి నాయకులను కూడా కూటమి ప్రభుత్వం బదిలీ చేసింది.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
ఎం.రాజబాబు	రాజమహేంద్రవరం-1	నిడదవోలు
ఆర్.రాంబాబు	ముమ్మిడివరం	రాజమహేంద్రవరం-1
పుల్లంరాజు	వట్లూరు	రాజమహేంద్రవరం-2
సీహెచ్ శ్రీనివాసబాబు	కొత్తపేట	బిక్కవోలు
ఇ.లక్ష్మీ	సామర్లకోట	కడియం
కె.కమలప్రియ	రాజమహేంద్రవరం-2	అనపర్తి
త్రినాథ్	కంకిపాడు	పిడింగొయ్యి
వీవీఎస్‌బీ శ్రీనివాస్	భీమడోలు	కోరుకొండ
ఐహెచ్‌ఆర్‌కే ప్రసాద్	కోరుకొండ	సీతానగరం
కె.సుందరరావు	పిడింగొయ్యి	కొవ్వూరు
మోహన్	కొవ్వూరు	వేగేశ్వరపురం
వి.వెంకటేశ్వర్లు	నిడదవోలు	రాజానగరం
ఇ.వెంకటేశ్వరరావు	కొవ్వూరు	అనంతపల్లి

పునరావాస కమిషనర్‌కే పోలవరం అడ్మినిస్ట్రేటర్ బాధ్యతలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

రంపచోడవరం, సెప్టెంబరు 24: పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా ప్రస్తుతం రాష్ట్ర పునరావాస కమిషనర్‌గా ఉన్న ఎస్.రామ సుందర్‌రెడ్డికే అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోలవరం అడ్మినిస్ట్రేటర్ పోస్టు గత కొంతకాలంగా ఖాళీగానే ఉంది. ఈ పోస్టుకు రెగ్యులర్ అధికారిని గత కొంతకాలంగా నియమించటంలేదు. పోలవరం అడ్మినిస్ట్రేటర్ పోస్టుతో పోలవరం ప్రాజెక్టు పునరావాస అంశాలు, భూ సేకరణ, పరిహారాల చెల్లింపు అంశాలు ముడిపడి ఉండటం, ఈ అంశాలకు సంబంధించి గత కొంత కాలంగా అనేక ఆరోపణలు వస్తుండటంతో ఈ పోస్టుకు అక్రమాలను సైతం ధైర్యంగా వెలికి తీసే అధికారి కోసం ప్రభుత్వం వెతుకుతోంది. దీంతో అంతవరకూ ఈపోస్టుకు పునరావాస కమీసనర్‌నే అదనపు బాధ్యతగా నియమించింది.

గిరిజన సంక్షేమశాఖ ఈఈగా శ్రీనివాసరావు



రంపచోడవరం, సెప్టెంబరు 24: రంపచోడవరం గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా ఐ.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ 1985లో గిరిజన సంక్షేమశాఖలో జాయిన్ అయ్యానని, వివిధ హోదాలో పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. ఏజెన్సీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సహ ఉద్యోగి నుంచి వేధింపులపై ఉద్యోగిని ఫిర్యాదు



మాట్లాడుతున్న ఉద్యోగిని

కాకినాడ సిటీ, సెప్టెంబరు 24: తాను పనిచేసే కార్యాలయంలో సహ ఉద్యోగి నుంచి లైంగిక వేధింపులు అధికమయ్యాయని, ఇంట్లో ఎవరూ లేనప్పుడు చెప్పు వస్తానంటున్నాడని కాకినాడ ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ డీసీపీ యూనిట్ మహిళా ఉద్యోగిని ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక డాల్ఫిన్ కాలనీలోని బీజేపీ సీనియర్ నాయకుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బాధితురాలు తన భర్తతో కలిసి మాట్లాడారు. తాను ఉద్యోగంలో చేరిన కొద్దిరోజుల్లోనే సహ ఉద్యోగి నుంచి లైంగిక వేధింపులు మొదలయ్యాయన్నారు. విషయం తెలుసుకుని పీడీ అడిగితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేశానని, తర్వాత కలెక్టర్‌కు, ఎస్పీకి, సీఐకి ఫిర్యాదు చేశానన్నారు. దీంతో పీడీ పిలిచి నీకు ఇష్టం ఉంటే చేయి లేకపోతే ఉద్యోగం మానేయమని ఇబ్బంది పెడుతున్నారన్నా రు. ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్‌లోనే ఈ విధంగా జరిగితే తాను ఎవరికి చెప్పుకోవాలని, తనకు న్యాయం చేయాలని బాధితు రాలు కోరారు.

దేశ అంతర్గత రక్షణకు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ దిక్సూచి

- 'నన్నయ' ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 24: త్రివిధ దళాలు దేశ సరిహద్దులో రక్షణ కవచంగా ఉంటే ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ దేశ అంతర్గత రక్షణకు, భవిష్యత్‌కు దిక్సూచిగా నిలుస్తాయని ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వెస్ట్‌జోన్ ఎన్‌సీసీ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరం ఎంపికలను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో జరిగే ఎంపికల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి వచ్చే ఏడాది జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవంలో నన్నయ విశ్వ విద్యాలయ ఔన్నత్యానికి చిహ్నాలుగా నిలవాలన్నారు. విద్యతో పాటు సమాజహితమైన కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర యువజన అధికారి ఎం.సైదా మాట్లాడుతూ ఈ శిబిరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రీ రిపబ్లిక్ డే శిబిరానికి ఎంపిక చేస్తామన్నారు. అందులో ప్రతిభావంతులైన వారిని ఢిల్లీ శిబిరానికి ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రతిభావంతులను ఎంపిక చేయడానికి ఏఏ అంశాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారో వివరించారు. మంగళవారం జరిగిన ఎంపికలకు ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి 155 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు హాజరయ్యారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీసీ మొక్కను నాటారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం వసూలు చేసిన రూ.30వేల చెక్కును ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నవోదయాలో ప్రవేశానికి దరఖాస్తుల గడువు పెంపు

పెద్దాపురం, సెప్టెంబరు 24: జవహర్ నవోదయా విద్యాలయాలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును మరోసారి పెంచినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. నవోదయా విద్యాలయ సమితి ఆదేశాల మేరకు వచ్చేనెల 7వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు తెలిపారు. ప్రవేశపరీక్ష 18.1.2025న జరుగు తుందని, వచ్చేనెల 8, 9 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సవరణలు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



పాములేరు వాగులో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

దొరకని మెడికో ఆచూకీ

- కొనసాగుతున్న గాలింపు చర్యలు
- డ్రోన్ కెమెరాతో జల్లెడ పడుతున్న అధికారులు

మారేడుమిల్లి, సెప్టెంబరు 24: అల్లూరిజిల్లా మారేడుమిల్లి జల తరంగిణిలో ఆదివారం కొట్టుకుపోయిన మెడికల్ విద్యార్థి చింతకుంట్ల హరదీప్ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. ఆదివారం జరిగిన ఈ దుర్ఘటన అనంతరం సహాయక చర్యలు చేపట్టిన అధికారులు సోమవారం ఇద్దరు వైద్య విద్యార్థినుల మృతదేహాలను కనుగొన్న సంగతి తెలిసిందే. మరొక విద్యార్థి హరదీప్ ఆచూకీ కోసం మంగళవారం కూడా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో కొండ వాగులు, కల్వర్టులు క్షుణ్ణంగా పరిశీలించారు. అయినప్పటికీ విద్యార్థి జాడ కన్పించక పోవడంతో రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి డ్రోన్ కెమెరాను వినియోగిస్తూ అనువనువునా జల్లెడ పడుతున్నారు. జలతరంగిణి నుంచి నీటి ప్రవాహం పలు కల్వర్టులు, దట్టమైన పొదలు మీదుగా ప్రవహిస్తూ పాములేరు వాగులోకి అక్కడి నుంచి గోదావరి నదిలోకి నీటి ప్రవాహం చేరుకొనే అవకాశం ఉండడంతో ఆదిశగా గాలింపు చర్యలను పోలీసు అధికారులు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా ఎన్‌డీఆర్‌ఎఫ్‌తో పాటు ప్రత్యేక బృందం డ్రోన్ కెమెరా సాయంతో పాములేరు వాగులో కొన్ని కిలోమీటర్ల మేర గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం బాగా చీకటిపడడంతో పాములేరు వాగు ప్రమాదకరంగా ఉండడంతో తిరిగి బుధవారం ఈ గాలింపు చర్యలను ముమ్మరం చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. సబ్‌కలెక్టరు కల్పశ్రీ, తహశీల్దారు సుబ్బారావు, సీఐ మురళీకృష్ణ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.



డ్రోన్ కెమెరా వినియోగాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

- బొలెరో వ్యాన్‌ను బైక్‌తో ఢీకొని అక్కడికక్కడే మృత్యువాత
- మృతులు చొప్పెల్ల, దుళ్ల వాసులు

ఆలమూరు, సెప్టెంబరు 24: ఆగి ఉన్న బొలెరో చేపల వ్యాన్‌ను బైక్‌తో వచ్చి ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇరువురు అక్కడిక్కడే మృత్యువాత పడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆల మూరు మండలం జొన్నాడ వద్ద జాతీయరహదారిపై మంగళవారం రావులపాలెం నుంచి పాత బ్రిడ్జి మీదుగా వస్తున్న మత్స్యకారుల చేప ల వ్యాన్ ఏటిగట్టు నుంచి కపిలేశ్వరపురం వెళ్లేందుకు ఆగుతుండగా అదే దారిలో బైక్ వస్తున్న ఆలమూరు మండలం చొప్పెల్లకు చెందిన వానపల్లి రాజేష్(30), కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వేగిరాజు సీతారామరాజు(36) ఆగుతున్న వ్యాన్‌ను గుర్తించకపోవడంతో వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. దీంతో వారు ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇంత భారీ ప్రమాదం జరిగి ఇరువురు మృతి చెందిన వారిలో ఒకరికి కూడా కనీసం గాయం కాకుండా మృత్యువాత పడటం ఆశ్చర్యం కలిగిస్తుంది. వెల్డింగ్ సామాన్లు కొనుగోలు చేయడానికి రావులపాలెం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయాం



వానపల్లి రాజేష్ (ఫైల్)

జొన్నాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వానపల్లి రాజేష్(30) వయస్సుకు చిన్నవాడే అయినప్పటికీ కుటుంబానికి ఆయన దిక్కు. చొప్పెల్ల గ్రామనివాసి అయిన రాజేష్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. దీంతో కుటుంబ భారం ఆయన తీసుకుని సోదరి వివాహంచేశారు.అవివాహితుడైన రాజేష్ తల్లికి పెద్ద దిక్కుగా ఉన్నాడు. రాజేష్ ఇటుకబట్టీ నిర్వహిస్తున్నాడు. కు టుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

దుళ్లలో విషాదఛాయలు



వి. సీతారామరాజు(ఫైల్)

కడియం: జొన్నాడవద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వేగిరాజు సీతారామరాజు (36) మృత్యువాత పడ్డాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సీతారామరాజుకు భార్య కోటేశ్వరి, 12ఏళ్ల కొడుకు షణ్ముఖ చైతన్య, 8ఏళ్ల కుమార్తె సాయికృష్ణ తేజస్విని ఉన్నారు. సీతారామరాజు తండ్రి సోలోమాన్‌రాజు డయాలసిస్ పేషెంట్. రెండు రోజులకొకసారి డయాలసిస్ చేయించాల్సిన పరిస్థితి. సీతారామరాజు వెల్డింగ్‌పని చేస్తూ ఆ కుటుంబానికి జీవనాధారంగా నిలిచాడు. ఇంటికి ఆధారమైన కొడుకు చనిపోడంతో ఆ కుటుంబం రోదన వర్ణనాతీతం. సీతారామరాజు కుటుంబాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కూటమి నాయకులు చిట్టూరి అమ్మిరాజు, గుర్రపు సత్యనారాయణ, దేవినాగేశ్వరరావు, కంటిపూడి శ్రీను, సత్యనారాయణ, గోపి ప్రసాద్, రాజు పరామర్శించారు.

రోడ్డు కం రైలు బ్రిడ్జి పైనుంచి దూకి

గోదావరిలో వ్యక్తి గల్లంతు

- భీమవరానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

కొవ్వూరు, సెప్టెంబర్ 24: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతయ్యాడు. మంగళవారం సాయంత్రం కొవ్వూరు, రాజమహేంద్రవరంల మధ్య గోదావరిపై ఉన్న రోడ్డు కం రైలు బ్రిడ్జి 127వ స్తంభం వద్ద బైక్‌ను పార్క్‌చేసి ఒక వ్యక్తి గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.జి.ప్రకాష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బైక్‌ను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బైక్ పై భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్టిక్కర్ అంటించి ఉండడం, నంబరు ప్లేట్ ఆధారంగా భీమవరం వ్యక్తిగా గుర్తించి భీమవరం పోలీసులకు సమాచారం అందించారు. గల్లంతైన వ్యక్తి భీమవరం మోటుపల్లి వీధికి చెందిన కార్పెంటరీ వర్కర్ నాయుడు సుబ్రహ్మణ్యంగా గుర్తించారు. బంధువులు అందించిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. గల్లంతయిన సుబ్రహ్మణ్యం కోసం గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు.

త్రుటిలో తప్పిన ఘోర బస్సు ప్రమాదం



రెండవవైపు రోడ్డులో పాకలోకి దూసుకు వెళ్లిన ట్రావెల్ బస్సు

తొండంగి,సెప్టెంబరు 24: ఘోర బస్సు ప్రమాదం త్రుటిలో తప్పడంతో దానిలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ట్రావెల్ బస్సు మంగళవారం తెల్లవారు జామున కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి వచ్చే సమయానికి టైర్ పంచర్ పడింది. దీంతో అది అదుపుతప్పి డివైడర్ మీదుగా దూసుకుంటూ రెండవ వైపు రోడ్డులోకి ప్రవేశించి అక్కడ ఉన్న పాకలోకి వెళ్లి ఆగింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సు ఇవతలి రోడ్డులోకి దూసుకు వచ్చే సమయానికి అటువైపుగా ఏదైనా వాహనం వచ్చి ఉంటే ఘోర ప్రమాదం జరిగేది. బస్సులో సుమారు 40మంది ప్రయాణికులు ఉన్నారు. ఏమి జరిగిందో అర్థంకాక వారంతా ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం తప్పిన తీరు తెలుసుకుని తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డ సంఘటనను తలచుకుని భయాందోళనకు గురయ్యారు.

అన్నవరంలో రివర్స్ టెండరింగ్ ద్వారా

నెయ్యి కొనుగోలు

- ఆంధ్రజ్యోతి కథనంపై దేవస్థానం అధికారుల వివరణ
- సింహాచలంలో కిలో నెయ్యి రూ.385.41కు, అన్నవరం దేవస్థానంలో 538.60

అన్నవరం, సెప్టెంబరు 24: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో నెయ్యి కొనుగోలుపై ఆంధ్రజ్యోతిలో అన్నవరం అవినీతి కథనంపై జిల్లా కలెక్టర్ వివరణ కోరడంతో మంగళవారం దేవస్థానం అధికారులు వివరణ ఇచ్చారు. అన్నవరం దేవస్థానంలో నెయ్యి కొనుగోలు ఈప్రోక్యూర్‌మెంట్, రివర్స్ టెండరింగ్ ద్వారా దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులకు లోబడి కొనుగోలు చేశామని వచ్చిన నెయ్యిని ఆక్యురేట్ ల్యాబ్ ద్వారా శాంపిల్స్ రిపోర్టు తీసుకుని సంతృప్తికరంగా ఉంటేనే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. సింహాచలం దేవస్థానంలో లక్కవరంకు చెందిన రైతు డైరీ కిలో నెయ్యి రూ.385.41 కి టెండర్‌ద్వారా కొనుగోలు చేయగా అన్నవరం దేవస్థానంలో అదేసంస్థ రూ.538.60కి కోడ్ చేసిందని పేర్కొన్నారు. అన్నవరందేవస్థానంలో నాణ్యమైన నెయ్యిని వాడుతున్నామని, ఇటీవల స్వామివారి ప్రసాదానికి కేంద్రప్రభుత్వం నాణ్యత పరిశీలించి ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ధృవీకరణపత్రం అందజేసిందని వివరణ ఇచ్చారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మండపేట, సెప్టెంబరు 24: పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను అత్యాచారం చేసిన యువకుడిపై మంగళవారం మండ పేట రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మండపేట రూరల్ ఎస్ఐ సురేష్‌బా బు తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక రాజమహేంద్ర వరంలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. బాలికను ప్రేమిస్తున్నానని రాజానగరం మండలం తుంగపాడుకు చెందిన యువకుడు సతీష్ సోమవారం బైక్‌పై తీసుకువెళ్లి అత్యాచారా నికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదుపై ఆ యువకుడిపై మంగళవారం మండ పేట రూరల్ సీఐ పీతల దొరరాజు ఆధ్వర్యంలో పోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపారు.

కడియంలో చిరుతపులి సంచారం

- పాదముద్రలు పరిశీలించిన అటవీశాఖ అధికారులు
- అవి పులివేనని నిర్ధారణ.. స్థానికుల్లో భయాందోళన

పులి అడుగుజాడలు



కడియం, సెప్టెంబరు 24: కడియం- వీరవరం రోడ్డులో జీఎస్‌ఆర్ ఫంక్షన్‌హాలు వెనుక ఓ పొలంలో మంగళవారం చిరుతపులి సంచారం చేస్తుందనే వార్త కడియం మండల ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. జీఎస్‌ఆర్ వెనుక ఉన్న నర్సరీలో కడియపులంకకు చెందిన మధు అనే రైతు పులినిచూసి భయాందోళనలకు గురి అవ్వడంతో పాటు పరుగులు తీసాడు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో అటవీశాఖ జిల్లా అధికారి భరణి ఆదేశాల మేరకు హుటాహుటిన అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అవి చిరుతపులి పాదముద్రలుగా నిర్ధారించారు. కదలికలను పరిశీలిస్తున్నారు. విషయం బయటకు రావడంతో అటవీశాఖ అధికారులు కడియం చేరుకున్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా వెళ్లాలని, రాత్రి సమయంలో బయటకు రావద్దని చెబుతున్నారు. కడియపులంక గ్రామం లో దోసాలమ్మకాలనీ ప్రజలు భయంతో వణికిపోతున్నారు. టార్చ్‌లైట్లు పట్టుకుని కేకలు వేసుకుంటూ తిరుగుతున్నారు. నర్సరీ కార్మికులు ఎవరూ బుధవారం పనుల్లోకి రావద్దని సెలవు ప్రకటించినట్టు నర్సరీరైతులు చెబుతున్నారు. మొక్కల ఎగుమతులతోపాటు నర్సరీల్లో ఎటువంటి పనులు ఉండవని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రి సమయంలో ఒంటరిగా రాకూడదని చిన్నపిల్లలను బయటకు తీసుకు రావద్దు అని, ఇంటి ఆరు బయట లైట్లు వేసుకుని ఉంచాలని హెచ్చరిస్తున్నారు. ప్రతీ ఆలయంవద్ద మైకులు సౌండ్ పెట్టాలని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. నర్సరీ ప్రాంతం కావడంతో ఏ మొక్కల మధ్య పులి ఉందో? అని నర్సరీ రైతులు, కార్మికులు భయంతో వణికిపోతున్నారు.

- దివాన్ చెరువులో మూడు రోజులుగా జాడ లేదు

దివాన్‌చెరువు ప్రాంతంలో మూడు రోజులుగా చిరుత జాడ లేకపోవడం, మంగళవారం రాత్రి నర్సరీ ప్రాంతంలో కనిపించడం అటవీశాఖ అధికారులు పులి జాడలే అని నిర్ధారించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పులి ఈ ప్రాంతం నుంచి ఎక్కడికి వెళ్లిందనేది అంతు పట్టడం లేదు. నర్సరీలో సీసీ కేమేరాలు ఉంటాయి. రైతులు నర్సరీల్లో ఉండటానికి సాహసించడం లేదు. గంటకు 100 కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా పయనించే ఈ చిరుత నర్సరీల్లో ఉందా ? అక్కడి నుంచి సమీపంలో ఉన్న మండపేట, ఆలమూరు మండలాల వైపు వెళ్లిందా? లేక కడియంలోనే ఉందా ? అనేది చర్చాంశనీయంగా మారింది.

రెవెన్యూ వర్సెస్ ఫారెస్టు

- చూచిరేవుల భూముల్లో ఇరుశాఖల మధ్య వివాదం
- రిజర్వు ఫారెస్టులో కార్పొరేట్ వ్యవసాయం కుదరదంటూ వ్యవసాయ పనులను అడ్డుకున్న అటవీశాఖాధికారులు
- అవి రెవెన్యూ భూములంటూ రెవెన్యూ అధికారుల వాదన



అడవిలో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, ఫారెస్టు అధికారులు

కూనవరం, సెప్టెంబరు 24: అల్లూరిజిల్లా కూనవరం మండలంలోని పైడిగూడెం పరిధిలో చూచిరేవుల గ్రామానికి చెందిన గిరిజనులకు ప్రభుత్వం కొంత భూమి ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన గిరిజన భూమి ఇప్పుడు రెవెన్యూ, అటవీ శాఖాధికారుల మధ్య వివాదంగా మారింది. ఈ భూములు మావంటే మావంటూ మంగళవారం ఆ ఇరు శాఖల అధికారులు సర్వే నిర్వహించుకున్నారు. మండల పరిధిలో చూచిరేవుల గ్రామస్తులకు ప్రభుత్వం సుమారు 200 ఎకరాలకుపైగా భూమిని గతంలో వారికి ఇచ్చినట్లు గిరిజనులు చెబుతున్నారు. ఆ భూములు తమవంటూ ఫారెస్టు అధికారులు రంగంలోకి దిగడంతో గిరిజనులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. 1970 నుంచి ఇప్పటివరకు చూచిరేవుల గిరిజనులు సజావుగానే వ్యవసాయం చేసుకుంటున్నారు. కౌలు పేరుతో వలస రైతులు ఆ భూముల్లోకి అడుగుపెట్టడంతో ఆ భూములు ఇప్పుడు ప్రస్తుతం వివాదంగా మారాయి. ఈ భూములు కంపార్టుమెంట్ 167 రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉన్నాయని ఈ భూముల్లో కార్పొరేట్ వ్యవసాయం కుదరదని అక్కడ జరుగుతున్న వ్యవసాయ పనులు అటవీశాఖాధికారులు అడ్డుకున్నారు. ఆదేశాలు వచ్చేవరకు ఈ భూముల్లో వ్యవసాయం నిర్వహించవద్దన్నారు. దీంతో భూ యజమానులైన గిరిజనులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం అటవీశాఖ, రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే నిర్వహించారు. సర్వే నెం. 123 ప్రకారం ఈ భూములు తమవేనంటూ రెవెన్యూ అధికారులు ఫారెస్టు అధికారులకు తెలియజేశారు. 1984 గెజిట్ ప్రకారం ఈ భూములు తమ రిజర్వు ఫారెస్టు ఆధీనంలో ఉన్నాయని అటవీశాఖాధికారిణి మోహిణి విజయలక్ష్మి అక్కడ రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఇవి మావంటే మావంటూ ఇరు అధికారులు వాదించుకోవడంతో చివరకు ఈసమస్య కొలిక్కిరాలేదు. ఈవిషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను అక్కడే పరిష్కరించుకోవాలని ఇరుశాఖల అధికారులు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తాము ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న భూమిపై పూర్తి హక్కులు కల్పించాలని చూచిరేవుల గిరిజనులు కోరుతున్నారు. గిరిజనులు స్వతహాగా వ్యవసాయం చేసుకుంటే తమకు అభ్యంతరంలేదని అటవీ జంతువులు తిరిగే ఈ ప్రదేశంలో విషపూరిత మందులతో వ్యవసాయం చేస్తే అటవీ జంతువులకు హాని కలిగే ప్రమాదముందని అందుకే కార్పొరేట్ వ్యవసాయం చేయవద్దని చెబుతున్న ట్లు అటవీశాఖాధికారులు చెబుతున్నారు.

కాకినాడ

సామాజిక స్థలాన్ని పరిశీలించిన డీసీపీ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 24: కాకినాడ 2వ డివిజన్ వైద్యనగర్ లోని సర్వే నెంబర్ 101లో ఖాళీగా ఉన్న సామాజిక స్థలాన్ని మంగళవారం నగర పాలక సంస్థ డీసీపీ హరిదాస్ పరిశీలించి స్థలం హద్దులు, సర్వేపై సిబ్బందితో మేప్ తీసుకుని పరిశీలించారు. దీనిపై ఆయన్ని వివరణ కోరగా ఇది కార్పొరేషన్‌కు చెందిన సామాజిక స్థలమని, పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించిన తర్వాత ఏ మేర సామాజిక స్థలం ఉంది, ఏయే మేర ఆక్రమణకు గురైందనే విషయాలు గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 24: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ, మంచి ఆహార అలవాట్లు అలవరచుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్యవంతంగా ఉండవచ్చని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి పేర్కొన్నారు. జీజీహెచ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పొగాకు నివారణ కేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు, వాటి ఉత్పత్తులను నివారించడంతో పాటు వాటిని యువతకు అందకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ ఆరోగ్య అజెండాలో భాగంగా పొగాకు విరమణ సేవల ప్రాముఖ్యత చెప్తూ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వర్చువల్‌గా పొగాకు నివారణ కేంద్రాన్ని ప్రారంభించారన్నారు. యువత పొగాకు ఉత్పత్తుల జోలికి వెళ్లకుండా సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సైకియాట్రీ విభాగ అధిపతి డాక్టర్ ఈ.రామచంద్రరావు, సామాజిక వైద్య విద్య విభాగాధిపతి డాక్టర్ పి.సుజాత ఉన్నారు.

ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలి : ఎస్డీపీవో

కాకినాడ రూరల్, సెప్టెంబరు 24: మోటార్ సైకిల్స్ నడిపే ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడుపరాదని కాకినాడ ఎస్డీపీవో రఘువీర్ విష్ణు సూచించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు రఘువీర్ విష్ణు సారథ్యంలో ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ ఆఖరి సంవత్సర విద్యార్థులకు మంగళవారం కాకినాడ 1వ పట్టణ, 2వ పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల సీఐల ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఎస్డీపీవో మాట్లాడుతూ వాహనాలను అతివేగంగా నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ ప్రమాదకరమని, మైనర్లు వాహనాలను నడిపితే జరిగే ప్రమాదాలపై వివరించారు. కార్యక్రమంలో సీఐలు డి.రామారావు, రమేష్ తదితరులు ఉన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేయాలి'

జగ్గంపేట, సెప్టెంబరు 24: అమరుల త్యాగాలు, వారి పట్టుదల, అంకితభావం నేటి తరం స్ఫూర్తిగా తీసుకుని ప్రజల సమస్యల పరిష్కారం కోసం పట్టుదలగా పనిచేయాలని సీపీఎం ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. భగత్ సింగ్‌నగర్‌లో కామ్రేడ్ షైక్ చంద్రయ్య, ఎస్ ముఖ్తర్ పాషా 4వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గుబ్బల ఆదినారాయణ, రామచంద్ర, బిహార్ల రెడ్డి, ఎస్.విజయకృష్ణ రెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు బి.సునీల్, సాదం కల్యాణి, భగత్ సింగ్ నగర్ కమిటీ కార్యదర్శి దార్ల వీరభద్రం తదితరులున్నారు.

బీజేపీ సభ్యత్వాల నమోదు

జగ్గంపేట, సెప్టెంబరు 24: జగ్గంపేట క్షత్రియ కళ్యాణ మండపంలో బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల కృష్ణ వర్మ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదావరి జోనల్ ఇన్‌చార్జి, స్కిల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ సాగి కాశీ విశ్వనాథ రాజు హాజరయ్యారు. పలువురు బీజేపీలో చేరారు. జగ్గంపేట అసెంబ్లీ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ట మంగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కామినేని జయశ్రీ, బీజేపీ ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి డీవీఎస్ రాజు, సభ్యత్వ ఇన్‌చార్జ్ గండి కొండలరావు, కో కన్వీనర్ కోనా సురేష్, మండల అధ్యక్షులు తోరాటి వెంకన్న, ఎస్సీ రెడ్డి, యడాల రాంబాబు, మేడిశెట్టి వీరబాబు ఉన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా శ్రీను

కాకినాడ సిటీ, సెప్టెంబరు 24: కాకినాడ నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా వేపాడ శ్రీను ఎన్నికయ్యారు. మంగళవారం అన్నదాన సమాజంలో బ్యాలెట్ విధానంలో సంఘ అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీను అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘ నాయకుడు తెల్లగొర్ల లక్ష్మీపతి, కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో తాళవరపు సాయి, అతం భద్రం, తన్నా రామారావు, తేడ మాణిక్యాలరావు, తాతపూడి శ్రీను, వేపాడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

'దళితుల స్వేచ్ఛా జీవనానికి భరోసా కల్పించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 24: పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు వందు అశోక్‌కుమార్, కమిటీ సభ్యులు మంగళవారం డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసి పలు దళిత సమస్యలపై మెమొరాండం అందజేశారు. ఇటీవలి రాష్ట్రంలో దళితులపై దాడులు, దళితుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని, దళితుల స్వేచ్ఛా జీవనానికి భరోసా కల్పించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, మాలే మేషురాజు, జల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఎన్ఎస్ఎస్ విద్యలో భాగమే'

జేఎన్టీయూకే, సెప్టెంబరు 24: ఎన్ఎస్ఎస్ విద్యలో ఒక భాగమేనని దీనిని ఆచరణాత్మక విద్యగా భావించాలని యూనివర్శిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.మోహన్‌రావు తెలిపారు. యూనివర్శిటీ, జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ యూనిట్లు 1,2,3ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల సెమినార్ హాల్లో జాతీయసేవాపథకం దినోత్సవాన్ని సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొత్తం ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా సేవ నమోదుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికార్లు రమణాజీ, కిరణ్మయి, వీరలక్ష్మి, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుడిని కాపాడిన పోలీసులు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 24: ప్రేమ వివాహం చేసుకోవడంతో కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తితో సముద్రంలోకి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడబోయిన గొరికి మహేష్‌ను కాకినాడ మెరైన్ పోలీసులు గమనించి రక్షించి సంఘటన సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. మెరైన్ ఏఎస్ఐ ఎం.ఏడు, హోంగార్డు పాల్ సముద్రంలోకి వెళ్లిపోతున్న మహేష్‌ను కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. ఎస్ఐ ఎంపీఎల్ రవీంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మహేష్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని బీహార్ వాసి మృతి

కరప, సెప్టెంబరు 24: మండలంలో పెనుగుదురు ప్రధాన రహదారిపై మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని బీహార్ రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తి మృతిచెందాడు. కరప పోలీసుల సమాచారం మేరకు కాకినాడ-ద్రాక్షారామ రహదారిలో పెనుగుదురు వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మదన్ కుమార్(35) సహ్నా అనే వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాలైన మదన్‌కుమార్ స్పాట్‌లోనే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కరప ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అతడి వద్ద లభించిన ఆధార్‌కార్డు సహాయంతో మృతుడిని బీహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్ జిల్లా గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్టు పోలీసులు తెలిపారు.

29న జిల్లా స్థాయి యోగా పోటీలు

పిఠాపురం, సెప్టెంబరు 24: ఇండియన్ యోగా ఫెడరేషన్, ఏపీ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని రథాలపేట వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఈనెల 29న జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం వీరబాబు తెలిపారు. 8 నుంచి 60ఏళ్ల వరకూ గల బాలబాలికలు, పురుషులు, మహిళలను గ్రూప్ వారీగా విభజించి పోటీలు జరుపుతామన్నారు. యోగా పోటీల్లో పాల్గొనదలిచినవారు 29వ తేదీ ఉదయం 7.30గంటలకు పోటీలు జరిగే స్థలం వద్ద రిపోర్టు చేయాలని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని యోగా శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని చెప్పారు. వివరాలకు సెల్ నెంబరు 9640 725485ను సంప్రదించాలన్నారు.

ఐసీడీఎస్, ఆదాని అధికారులతో
అంగన్‌వాడీ యూనియన్ చర్చలు విఫలం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 24: అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులతో స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారులు, ఆదాని అధికారులతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రావతి ప్రకటించారు. అంగన్‌వాడీ విధుల్లో ఆదాని వలంటీర్ ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 26న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన భారీ ధర్నా యథావిధిగా కొనసాగుతుందన్నారు. ఆదాని పరిశ్రమలు ఉన్న 15 కిలోమీటర్ల పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లలో ఆదాని నియమించిన వలంటీర్లతో పని చేయించేందుకు ప్రయత్నించడాన్ని అంగన్‌వాడీ సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. దీనిపై ఐసీడీఎస్ పీడీ క్రైస్తవ యూనియన్ ప్రతినిధులు, ఆదాని అధికారులతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఆదాని వలంటీర్లను అంగన్‌వాడీ సెంటర్లలోకి అనుమతించబోమని అంగన్‌వాడీ వర్కర్లు తేల్చి చెప్పారు. సమావేశం నుంచి బయటకు వచ్చారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ, జిల్లా కోశాధికారి జెరూసలెమ్మ, జిల్లా కమిటీ సభ్యులు వీరవేణి పాల్గొన్నారు.

వంద రోజుల్లో హర్షించేలా పరిపాలన

» కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు » పలుచోట్ల ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు » పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కాకినాడలో మాట్లాడుతున్న కొండబాబు, కరపలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నానాజీ, సామర్లకోట: కరపత్రం అందజేస్తున్న రాజప్ప, తొండంగి : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దివ్య

కాకినాడ సిటీ, సెప్టెంబరు 24: గడిచిన వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజలు హర్షించే విధంగా పరిపాలన అందించామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. మంగళవారం సినిమా రోడ్డులోని అన్నదాన సమాజంలో 27, 28, 29, 31, 32 డివిజన్లకు సంబంధించి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ మనోహర్, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, ట్రెజరర్ నీల మేఘ్ సత్యనారాయణ, ఆర్వన్ తహసీల్దారు జితేంద్ర, టీడీపీ శైలజ తమ శాఖల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఎస్ రహీమ్, చింతపూడి రవి, బంగారు సత్యనారాయణ, పోలిశెట్టి బుజ్జి, చొల్లంగి వీరబాబు, గదుల సాయిబాబు, కోడూరి కుమారస్వామి, ఆకులకుటి బలరాం, రెడ్డిం సతీష్‌బాబు, గుండా నూరి బాబు, నెల్లి రమణ, గుర్రాల శ్రీనివాసరావు, రికార్డ్ లక్ష్మి, సిరియాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో ముందుకు

కరప, సెప్టెంబరు 24: గత వైసీపీ నిర్వాకంతో రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఎన్ని ప్రతిబంధకాలు ఎదురవుతున్నా వెరవక కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలనతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కరప చిరంజీవి కల్యాణమండపంలో ఇది మంచి ప్రభుత్వం పేరుతో వంద రోజుల పాలనపై నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించి ప్రభుత్వానికి మద్దతు నివ్వాలని విజ్ఞప్తిచేశారు. ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ, జనసేన నేతలు పిల్లి సత్తిబాబు, కటకంశెట్టి బాబీ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, వెంకటేశ్రీనివాసులు, చప్పిడి వెంకటేశ్వరరావు, దేవు వెంకన్న, బోగిరెడ్డి కొండబాబు, బందారు మురళి, బోగిరెడ్డి గంగాధర్, ముమ్మిడి పుష్పలత, మట్టా ప్రకాష్, గౌడ్‌కార్యదర్శి వాసిరెడ్డి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల మంచి కోరే ప్రభుత్వం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 24: కూటమి ప్రభుత్వం ప్రజల మంచి కోరే ప్రభుత్వమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని పెద్దిపాలెంలో జరిగిన సమావేశంలో సత్యప్రభ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ 100 రోజుల్లోనే రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలతో సురక్షితంగా ఉండేలా పాలన అందించారని తెలిపారు. వ్యవసాయ శాఖ రూపొందించిన పోలంబడి పోస్టర్‌ను ఎమ్మెల్యే నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహశీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీవో కుమార్‌బాబు, ఈవోపీఆర్‌డీ కాశీ విశ్వనాథ్, సర్పంచ్‌లు దేవర మానస రమేష్, మంతెన శ్రీను, వనపల్లి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, లోండా బోదరాజు, అమరాడి వెంకట్రావు, పల్లా గోపి ఉన్నారు.

ప్రజాదరణ పొందిన ప్రభుత్వం

సామర్లకోట, సెప్టెంబరు 24: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కేవలం 100రోజులకే పలు ప్రజాసంక్షేమ పథకాలు అమలుచేసి ప్రజాదరణ పొందిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. మండలంలోని వీకేరాయపురం గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి వెంకటరమణ హాజరై ప్రసంగించారు. ఇంటింటా పర్యటించి వంద రోజుల పాలనలో చేపట్టిన విజయాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. తహశీల్దార్ కొవ్వూరు చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీవో డి.శ్రీలలిత, ఎంఈవో వైకనరామకృష్ణయ్య, పాలకుర్తి శ్రీనుబాబు, గుమ్మళ్ల రామకృష్ణ, తోటకూర శ్రీనివాస్, మునిరెడ్డి శ్రీరాములు, మునిరెడ్డి రాంబాబు, చీకట్ల వెంకటేష్, కుర్రా రాజు తదితరులున్నారు.

ప్రజల కష్టాలు దూరం

తొండంగి, సెప్టెంబరు 24: వంద రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన పరిపాలన అందించి ప్రజల కష్టాలు దూరం చేశారని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. పెదవిస్సలపాలెం, రావికంపాడు, కొమ్మనాపల్లి, సీతారాంపురం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, కొయ్యా రామకృష్ణ, కోడ వెంకటరమణ, కొయ్యా శ్రీను, సాధనాల సూరిబాబు, నరహరిశెట్టి సూర్యప్రకాష్, వడ్డీ రాంబాబు, అరిగెల నర్సింహామూర్తి, సిద్దా రాంబాబు, గుంట చిన్నారావు, స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుని రూరల్: పట్టణంలో జరిగిన కార్యక్రమంలో 100రోజుల్లో కూటమి ప్రభుత్వం తలపెట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే దివ్య వివరించి కరపత్రాలు అందజేశారు. టీడీపీ నాయకులు యనమల రాజేష్, యినిగంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనేడి నాగభూషణరావు (అబ్బాయి), మాజీ కౌన్సిలర్లు సిద్దాంతపు సతీబాబు, ముక్క గణేష్, అల్లు రాజు, జల్లురాజు ఉన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధం

కొత్తపల్లి, సెప్టెంబరు 24: ఉప్పాడ తీర ప్రాంతంలో త్వరలో పేదల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. నాయకర్ కాలనీలో జనసేన నాయకుడు గంటా విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనసైనికులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, మత్తా ఆప్పాజీ, స్వరాజ్ పొదిలిడా నైదల్ మూరాలకెట్టి సుబ్రహ్మణ్యం, ఉప్పాడ మాజీ సర్పంచ్ బందన సందీప్‌రావు, మాజీ ఎంపీటీసీ కంచేపల్లి సూరరాజు, రాంబాబు, లోవబాబు, జనసైనికులున్నారు.

బూరుగుపూడిలో...

కిర్లంపూడి, సెప్టెంబరు 24: మండలంలోని బూరుగుపూడిలో జరిగిన కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఎన్డీయే నేతలు పూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొస్టింగ్‌లను ఎగ్జిబిషన్‌ను తిలకించారు. నెహ్రూ మాట్లాడుతూ బూరుగుపూడి రూ.40లక్షలు ప్రతిపాదనలు వంపిస్తే రూ.20లక్షలు మంజూరయ్యాయని, మరో 20 లక్షలు మంజూరుచేయాలన్నారు. ఎన్ఎస్ ఆప్పలరాజు, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, చదరం చంటిబాబు, పాటంశెట్టి రవి, కుంచే తాతాజీ, కస్టర్ ఇన్‌చార్జి పాటంశెట్టి మురళీకృష్ణ, సర్పంచ్ ఆకపు రమలక్ష్మి, ఉపసర్పంచ్ పాటంశెట్టి కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ పాటంశెట్టి సత్యవతి తదితరులు ఉన్నారు.

మరిడమ్మ దేవస్థానం ఏసీగా విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం, సెప్టెంబరు 24: మరిడమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌గా కురం విజయలక్ష్మి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. రాజమహేంద్రవరం హితకారిణి సమాజం ఏసీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఏసీగా పనిచేసిన వేప్లోలు రామ్మోహనరావు అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి విలేకర్లతో మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

'దాడి హేయమైన చర్య'



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 24: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్. ఉమామహేశ్వరరావుపై ఎమ్మెల్యే చంద్రం అనుచరులు జరిపిన దాడి అత్యంత హేయమైన చర్య అని, ఈ దాడిపై పోలీసులు స్పందించి తీర సత్వ సమాజం తలదించుకునేలా ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) అభిప్రాయపడింది. మంగళవారం జూనియర్ డాక్టర్లతో కలిసి భారీ ర్యాలీ చేసి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ కేసును మరోసారి పూర్తిగా పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు.

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

తాళ్లరేవు, సెప్టెంబరు 24: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఒక్కరు నియంత్రించాలని కాకినాడ రేంజర్ ఎస్ఎస్ఆర్‌వరప్రసాద్ అన్నారు. మంగళవారం కోరింగ పంచాయతీ పరిధి కాకినాడ సముద్రంలో ఉన్న హోప్ ఐలాండ్‌లో అటవీశాఖ, కాకినాడ మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ ఆథార్టీ అధికారులు సంయుక్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో 400 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. నిర్వాహకులు సారధి, కోనేరు, ఎంపెడా, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్ స్కూల్ ఒక వరం'

సామర్లకోట, సెప్టెంబరు 24: వివిధ కారణాల వల్ల అర్థాంతరంగా చదువు మానివేసినవారికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ ఒక వరంలాంటిదని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్‌స్కూల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్, జిల్లా కో-ఆర్డినేటర్ ఏ.సాయి వెంకటరమణ పిలుపునిచ్చారు. సామర్లకోట ఎంఈవో వైకనరామకృష్ణయ్య, పి.వి లిర్లలో ఓపెన్ స్కూల్ నిర్వహించారు. సామర్లకోట మండలం 25 మండలాల్లో దానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఓపెన్ స్కూల్‌లో చేరాలనుకునే వారు ఈ నెల 28వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది ప్రశాంతి, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, మణికంఠ పాల్గొన్నారు.

ఇసుక తరలింపు అడ్డగింత

కిర్లంపూడి, సెప్టెంబరు 24: జిల్లాల ఏలేరు ప్రాజెక్టు నుంచి భారీ వరద రావడంతో స్థానిక కాలువలో ఇసుక మేటలు భారీగా చేరాయి. దీంతో కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. గ్రామస్థులు, జనసేన నాయకులు అడ్డుకున్నారు. ప్రభుత్వాధికారులు అక్రమ ఇసుక తరలింపుపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్

జగ్గంపేట, సెప్టెంబరు 24: జగ్గంపేటలో పాత పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహించి పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు. క్యాంటీన్‌ను జనసేన నాయకుడు సూరంపాలెం బాలు ఆర్థిక సహాయం అందించారు. అల్లు శ్రీనివాస్, గుత్తుల గంగాధర్, కుంచే కోటి, బాదిశెట్టి శ్రీను, మాదారపు వీరబాబు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

తొండంగి, సెప్టెంబరు 24: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రావికంపాడు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలోని 10 ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. షటిల్, ఫుట్‌బాల్, వాలీబాల్, చెస్, యోగా, కబడ్డీ తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఎంఈవో అనిశెట్టి సుబ్బిరెడ్డి, హెచ్ఎమ్ ప్రసాద్, పీడీ మూర్తి తదితరులున్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కరప, సెప్టెంబరు 24: యండమూరు ఎంపీపీ పాఠశాలలో పలువురు విద్యార్థులకు నవోదయ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఎం.ఎం.టీ.ఎమ్ సొంత నిధులను వెచ్చించి స్టడీ మెటీరియల్, డైరీలను సమకూర్చగా ఎంతో కొవ్వల బులిశ్శవేణి చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. సర్పంచ్ మారిశెట్టి శివ, విశ్రాంత ఎంపీడీవో మారిశెట్టి రాంబాబు, ఎస్ఎంసీ చైర్మన్ సోమ్య ఉపాధ్యాయులు లోవరాజు, సీఆర్‌పీ సారకుమారిలు పాల్గొన్నారు.

తరలిపోతున్న కొండ గ్రావెల్

తుని రూరల్, సెప్టెంబరు 24: అధికారుల చోద్యంతో కొండ గ్రావెల్‌ను అక్రమార్కులు తరలించేస్తున్నారు. దొండవాడ శివారు రెవెన్యూ కొండపై జేసీబీలతో తవ్వకాలు జరిపి గ్రావెల్‌ను పట్టపగలే తరలించుకుపోతున్నారు. సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని అక్రమ తవ్వకాలు అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'తోట'కు అభినందన



రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నగరానికి చెందిన జనసేన నేత తోట సుధీర్‌ను నియమించారు. మంగళవారం ఆయనకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

- కలెక్టరేట్ (కాకినాడ)

పవన్ దీక్షకు సంఘీభావం



సత్యదేవుని తొలిమెట్టు వద్ద కూరగాయలతో సత్యనారాయణ, జనసైనికులు

అన్నవరం, సెప్టెంబరు 24: తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యి వ్యవహారంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు అన్నవరంలో సత్యదేవుని తొలిపావంచా వద్ద నియోజకవర్గ జనసేన నాయకులు వరుపుల తమ్మయ్యబాబు ఆధ్వర్యంలో జనసైనికులు సంఘీభావం తెలిపారు. తొలిపావంచా వద్ద టెంకాయలు కొట్టి హారతులిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. తమ్మయ్యబాబు మాట్లాడుతూ గతపాలకుల తీరుతో భ్రష్టుపట్టించారని, హిందువుల మనోభావాలను విఘాతం కలిగేలా వ్యవహరించారని, వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసైనికులు బందారు రామారావు, వరుపుల సాయిరామ్, నల్లల రామకృష్ణ, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుబాష్, నడుచు సూరిబాబు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా సర్పవరం జంక్షన్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని బీజేపీ రూరల్ అసెంబ్లీ కన్వీనర్ పిల్లా లీలావతి కూటమి మహిళా కార్యకర్తలతో కలసి పరిశుభ్రం చేశారు. కూటమి మహిళా నాయకులు గిరజాల లక్ష్మీదేవి, మిరియాల హైమావతి, నలంద గంగాభి, గిద్దలూరు యశోద, బండి జోగేశ్వరి, పాలిక సత్య ఎల్ల నీడి పద్మావతి తదితరులున్నారు.

తాళ్లరేవు: తాళ్లరేవు శేషమ్మ ఆలయంలో జనసేన ఉపయోగిరాజు ఆధ్వర్యంలో జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ ముత్యాల జయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయశుద్ధి జరిపి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరమహిళలు గిడ్డి రత్నశ్రీ, మంగ తాయారు, శిరీష, జనసైనికులు సూరంపూడి కుమార్, పోతుల రాజు, చింతపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: పవన్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా పట్టణంలోని ఉప్పాడ సెంటర్ వద్ద జనసేన వీరమహిళలు, వైద్యుల సెల్ ప్రతినిధులు నిరసన తెలిపారు. డాక్టర్ పంతం వద్మశ్రీ, డాక్టర్ సిహెచ్ వరలక్ష్మి, వీరమహిళలు తోలేటి శిరీష, ఏకమల, కుక్కల నాగలక్ష్మి, కామిశెట్టి సత్యవేణి, మేడిశెట్టి నాగలక్ష్మి పాల్గొన్నారు. శిబిరాన్ని పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సందర్శించారు.

'క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలి'

శంఖవరం, సెప్టెంబరు 24: పోటీల్లో గెలుపోటములు సహజమని, విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మంగళవారం కత్తిపూడి ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అండర్14, అండర్ 17 విద్యార్థులు హాజరయ్యారు. టీడీపీ నేతలు వర్రత సురేష్, బద్ది రామారావు, వెన్నా శివ, ఉల్లి వీరభద్రరావు, కీర్తి వెంకటసుబాష్, జనసేన నేతలు మేడిశెట్టి సూర్యకిరణ్, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుబాష్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సురేష్, పాకల ప్రసాద్, సర్గం గోవింద్, కండిబోయిన శ్రీను, గాబు కృష్ణ కొయ్యా రమణ పాల్గొన్నారు.



కత్తిపూడిలో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వ్యవసాయశాఖ పద్ధతులతో అధిక దిగుబడులు

» వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ » పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'



తాళ్లరేవు: పి.మల్లవరంలో రైతులకు వివరిస్తున్న జేడీ, కిర్లంపూడి: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

తాళ్లరేవు, సెప్టెంబరు 24: వ్యవసాయశాఖ పద్ధతులను రైతులంతా పాటిస్తే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎన్. విజయకుమార్ తెలిపారు. మంగళవారం పి.మల్లవరం పంచాయతీ మూలపొలం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎస్ బాబూరావు, ఏవో ప్రశాంతి, వెటర్నరీ డాక్టర్ డి.సుధ, మత్స్యశాఖాధికారి గోపి, హార్టికల్చర్ బి.రామకృష్ణ రైతులకు వ్యవసాయ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పద్ధతులను వివరించారు. టీడీపీనేతలు దూళిపూడి వెంకటరమణ, వంగలా వెంకటేశ్వరరావు, గంధం సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్: చినజగ్గంపేట, వన్నెపూడి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మండల వ్యవసాయాధికారి కే.సత్యనారాయణ మాట్లాడుతూ పంటలపై ఎక్కువ పురుగులు, తెగుళ్లు ఆశించినట్లు గుర్తిస్తే తక్షణం సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పశువైద్యాధికారిణి డాక్టర్ హిమజ, సెరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ ధర్మరాజు, మత్స్యశాఖాధికారి వైద్యనాథ, మార్కెటింగ్, పీఏసీఎస్‌ల నుంచి రాంబాబు, ఏపీఓ రమణ హాజరయ్యారు.

సామర్లకోట: పొలం పిలుస్తోంది అవగాహన సదస్సులో రైతులు మరింత చైతన్యవంతులు కావాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. వీ.మేడపాడు, కాపవరం గ్రామంలో ఏవో జనప్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా రాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ ఇంచార్జి వెంకటరమణ హాజరై పోస్టరును ఆవిష్కరించారు. రైతులకు ఎలుకల నివారణకు బ్రోమాడియోలిన్ మందు ప్యాకెట్లను అందజేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: బూరుగుపూడిలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరించారు. జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, డీడీ వివిఎస్ఎస్ హరి, ఏడీఏ ఎన్.వెంకటరావు, తహశీల్దార్ ఆదినారాయణ, ఎంపీడీవో పి.వి.ఎస్ వరప్రసాద్ ఉన్నారు.

రౌతులపూడి: రౌతులపూడి, రామవరపుపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు, టీడీపీ నాయకుడు జటంశెట్టి అశోక్, మాజీ సొసైటీ డైరెక్టర్ యర్రా వరహాలుబాబు, టీడీపీ నేత పైల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: సిరిపురంలో ఏవో జ్యోతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడారు. టీడీపీ మండలాధ్యక్షుడు సూతి బూరయ్య, సర్పంచ్ పీతల సూరరాజు, దనేకుల అచ్యుత దీపుడు, వెలుగూరి హేరామ్, సుంగ ప్రకాశ్ ఉన్నారు.

కొత్తపల్లి: ఇసుకపల్లి, నాగులాపల్లి గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణపై ఏవో వట్టి జోగినాయు రైతులకు అవగాహన కల్పించారు. రైతు నాయకులు యరకం సూర్యనారాయణ రెడ్డి, బీజేపీ నాయకుడు డీవీఎస్ రాజు, రాము సుబ్బారెడ్డి, ఏఈవో యరకం గౌతమ్ పాల్గొన్నారు.

గండేపల్లి: యర్రంపాలెంలో కార్యక్రమంలో ఏవో సద్గురుమూర్తి మాట్లాడారు. సర్పంచ్ చిన్నారి, వీఆర్వో బాబా, పీఏసీ సుమిత్ర, టీడీపీ అధ్యక్షుడు ముత్యాల భాస్కరరావు, నాయకులు చిక్కాల వెంకటరమణ, జిల్లుల లచ్చయ్య ఉన్నారు.

పెద్దాపురం: గోరింటలో నిర్వహించిన కార్యక్రమంలో సామూహిక ఎలుకల నివారణ సంబంధించి మందు తయారీ విధానాన్ని రైతులకు చేసి చూపించారు. ఏవో కొమ్మిశా సంజయ్ కుమార్, పశువైద్యాధికారి వుస్తాఫ్, ఉద్యానశాఖాధికారి సత్యనారాయణ, ఏఈవో ప్రసాద్, వ్యవసాయ సహాయకులు సాదికా ఉన్నారు.

తుని రూరల్: డి.పోలవరంలో వ్యవసాయశాఖ విస్తరణాధికారి ఎస్ బుల్లియు రైతులకు అవగాహన కల్పించారు. పెద్ద వాక కళ్ళ శాస్త్రవేత్తలు డాక్టర్ శర్మ, డాక్టర్ రమేష్, డాక్టర్ ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. ఏవో అశోక్ కుమార్, వ్యవసాయ సహాయకులు శ్రీను, లోవరాజు, వెంకటేష్, శివాజీ, తులసి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పలకా సోమేశ్వరరావు ఉన్నారు.

జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం

పిఠాపురం/తునిరూరల్/గండేపల్లి/ ప్రత్తిపాడు, సెప్టెంబరు 24: బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల ఏకధాటిగా గంటపాటు కురిసిన భారీ వర్షంతో పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ, రహదారులు ఏకమయ్యాయి. గొల్లప్రోలులో భారీ వర్షం పడింది. తునిలో మధ్యాహ్నం కురిసిన కుండపోత వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో పట్టణంలో పలు కూడళ్లలోపాటు పలు వార్డుల్లో వర్షపునీరు చెరువులను తలపించింది. గండేపల్లి మండలంలో వర్షం దంచికొట్టింది. ప్రత్తిపాడులో మంగళవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది.



తునిలో వర్షపునీటిలో వెళ్తున్న వాహనాలు